క్లుప్తంగా

నూతన కార్యవర్గం ఎన్నిక



బాన్సువాడ రూరల్: మండలంలోని కోనాపూర్ గ్రామాభివృద్ధి కమిటీని ఆదివారం గ్రామస్తులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జెట్టి మొగలాకర్ రావు, ఉపాధ్యక్షులుగా చొల్లేటి శ్రీనివాస్, కార్యదర్శిగా వడ్ల శివరాం, శ్రీను, కోశాధికారిగా పన్నెల సాయిరెడ్డి, సలహాదారులుగా వెంకట రమణ ఎన్నికయ్యారు.

ఆదిబసవేశ్వరాలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభం



బాన్సువాడ రూరల్: మండలంలోని బోర్లం క్యాంపులో గల ఆదిబసవేశ్వర ఆలయం శిథిలావస్థకు చేరడంతో ఆదివారం గ్రామస్తులు ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభించారు. సుమారు రూ.20లక్షల అంచనా వ్యయంతో ఆలయాన్ని నిర్మిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. దాతలు స్పందించి సహకారం అందించాలని మందిర నిర్మాణ కమిటీ సభ్యులు సంగం శ్రీనివాస్‌రెడ్డి, కొండ శ్రీశైలం, ఆనంద్, సుభాష్, సంజీవ్‌రెడ్డిలు కోరారు. వివరాలకు 9908309939, 9959702346ను సంప్రదించాలన్నారు.

అందుబాటులో యూరియా



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం పరిధిలోని గ్రామాల్లో యూరియా బస్తాలు అందుబాటులో ఉన్నట్లు సహకార సంఘం చైర్మన్ దేవేందర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. లింగంపేట సహకార సంఘంలో 1200 బస్తాలు, భవానిపేట 620 బస్తాలు, శెట్పల్లిలో 600 బస్తాలు రైతులకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సీఈవో పెంటయ్య, సిబ్బంది ఉన్నారు.

సీపీఐ బలోపేతానికి కృషి



బాన్సువాడ: సీపీఐ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నానని, కార్యకర్తలు, ప్రజా సంఘాలు నాయకులు కూడా కృషి చేయాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దుబాస్ రాములు అన్నారు. బాన్సువాడలోని పార్టీ కార్యాలయం వద్ద ఆదివారం ఆయన జెండాను ఎగురవేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని అన్నారు. నాయకులు శంకర్, కమ్మరి రాములు, విష్ణు, నారాయణ, సురేష్, సాయిలు, మాధవి, తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి పటిష్టం చేయాలి



పిట్లం(జుక్కల్): కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత పటిష్టం చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మధుసూదన్, ఇన్‌చార్జి అమృత అన్నారు. పిట్లంలో ఆదివారం జుక్కల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో పార్టీ బలోపేతం, యువతలో చైతన్యం పెంపు, మండలాల స్థాయిలో కార్యకర్తల సమన్వయం, రాబోయే కార్యక్రమాల ప్రణాళికలపై చర్చలు నిర్వహించారు. నాయకులు అబ్దుల్ ఇమ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవ గద్దె నిర్మించాలి



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని నంది విగ్రహం వద్ద కూల్చివేసిన సీసీ రోడ్ ప్రారంభోత్సవం గద్దెను వెంటనే నిర్మించాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో కూల్చివేసిన గద్దెను ఆదివారం బీఆర్‌ఎస్ నాయకులు పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. 2022లో గత ప్రభుత్వ నిధులతో సీసీ రోడ్లను, ప్రారంభోత్సవ గద్దెను ఏర్పాటు చేశారని, కాంగ్రెస్ నాయకులు ఉద్దేశపూర్వకంగానే గద్దెను కూల్చివేశారని అన్నారు. గద్దెను నిర్మించకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. బద్దం శ్రీనివాస్ రెడ్డి, అల్తాఫ్, గాధారి అశోక్‌రెడ్డి, రాజేశ్వరరావు, పోలీస్ బాల్రెడ్డి, దాకయ్య, కొమ్ము సాయిలు, కొర్రి స్వామి, వంగటి సంతోష్, పొన్నం రాజయ్య, వంగరి గణేష్, సాయన్న, వంగిటి రమేష్‌రెడ్డి, రాజు పాల్గొన్నారు.

బిల్లులు రాక.. పనులు జరుగక..





సింగితం గ్రామంలో అర్ధంతరంగా నిలిచిన ఆరోగ్య ఉప కేంద్ర భవన నిర్మాణ పనులు.. బంజపల్లి గ్రామంలో..

- పలు గ్రామాల్లో అర్ధంతరంగా నిలిచిన ఆరోగ్య ఉప కేంద్రాల భవన నిర్మాణాలు
- పట్టించుకోని అధికారులు

నిజాంసాగర్(జుక్కల్): గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాలను ఏర్పాటు చేసింది. కానీ పలు గ్రామాల్లో ఆరోగ్య కేంద్రాలకు సొంత భవనాలు లేకపోవడంతో అద్దె భవనాలు, ఇరుకైన గదుల్లో నిర్వహిస్తున్నారు. నిజాంసాగర్, మహమ్మద్ నగర్ మండలాల్లోని ఆరోగ్య కేంద్రాలకు సొంత భవనాల కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేయగా, నిధులు రాకపోవడంతో పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. దీంతో వైద్య సిబ్బందితోపాటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

2023లో నిధులు మంజూరు..

నిజాంసాగర్, మహమ్మద్ నగర్ మండలాల్లోని బంజపల్లి, అచ్చంపేట, నర్వ, సింగితం గ్రామాల్లో ఆరోగ్య ఉప కేంద్రాలకు సొంత భవనాల కోసం 2023లో అప్పటి ప్రభుత్వం రూ. 20లక్షల చొప్పున మంజూరు చేసింది. నిధులు కేటాయించినా పూర్తి స్థాయిలో మంజూరు కాకపోవడంతో సంబంధిత కాంట్రాక్టర్ పనులను అర్ధంతరంగా నిలిపివేశారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. బంజపల్లి, నర్వ, సింగితం గ్రామాల్లో ఆరోగ్య ఉప కేంద్రాల పనులు స్లాబ్ వరకు చేపట్టారు. అంత వరకు చేపట్టిన పనులకు కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లింపు చేపట్ట లేదు. దీంతో సదరు కాంట్రాక్టర్లు పనులు అర్ధంతరంగా ఆపేశారు. అలాగే అచ్చంపేట గ్రామ పంచాయతీలో ఆరోగ్య ఉప కేంద్రం భవన నిర్మాణ పనులు మాత్రం శంకుస్థాపనకే పరిమితం అయ్యాయి. సదరు గ్రామ పంచాయతీలో ఆరోగ్య ఉప కేంద్రం నిర్మాణానికి గ్రామ పంచాయతీ వారు స్థలాన్ని కేటాయించినా పనులకు శ్రీకారం చుట్టలేదు. పనులను దక్కించుకున్న ఓ కాంట్రాక్టర్‌ను 'సాక్షి' సంప్రదించగా.. ఆరోగ్య ఉప కేంద్రం భవన నిర్మాణానికి సంబంధించిన బిల్లులు చెల్లిస్తేనే పనులు ముందుకు సాగిస్తామన్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఒక్క బిల్లు కూడా రాలేదు. భవన నిర్మాణాలు పూర్తి చేసినా ప్రభుత్వం నుంచి బిల్లులు సకాలంలో వస్తాయన్న నమ్మకం లేదు. బిల్లులు వస్తేనే పనులు కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరు చేసి పనులు పూర్తిచేయించాలని ప్రజలు కోరుతున్నారు.

శిథిలావస్థలో తూము షట్టర్లు



షట్టర్ పడిపోకుండా కట్టిన తాడు

బాన్సువాడ రూరల్: మండలంలోని కోనాపూర్ గ్రామం కొనసముద్రం చెరువు తూము షట్టర్లు చెడిపోయి ఏళ్లు గడుస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. చెరువుకు 3 తూములు ఉండగా ఒక పెద్ద తూము మాత్రమే బాగుందని, రెండు చిన్నతూములు శిథిలావస్థకు చేరాయని గ్రామ రైతులు తెలిపారు. గత ఏడాది ఒక తూము వద్ద షట్టర్ పాడైపోవడంతో నీటిపారుదల శాఖ అధికారులు స్పందించి రైతుల సహకారంతో తాత్కాలికంగా తాడుకట్టారు. పూర్తిస్థాయి మరమ్మతుల కోసం అధికారులకు ఎన్నిసార్లు ఫోన్‌లో ఫిర్యాదు చేసినా 'బడ్జెట్ లేదు మేం ఏం చేయాలి'..? అంటూ దాటవేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదకరంగా స్తంభాలు

నస్రుల్లాబాద్: మండలంలోని ఆయా గ్రామాల్లోని పంట పొలాల్లో విద్యుత్ స్తంభాలు ఒక వైపుకు వంగిపోయి పడిపోవడాని సిద్ధంగా ఉన్నాయి. సంబంధిత అధికారులకు సమాచారం అందించినా కూడా కన్నెత్తి చూడటం లేదని రైతులు వాపోతున్నారు. వర్షాలు కురిసి స్తంభాలు పడిపోయాకే అధికారులు వస్తారని అప్పటి వరకు కన్నెత్తి చూడరని అన్నదాతలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, స్తంభాలను బాగుచేయాలని ప్రజలు కోరుతున్నారు.



మిర్జాపూర్ శివారులో వంగిపోయిన స్తంభం

దోమల ఆవాసంగా మురికి గుంత



తాడ్కోల్‌లో రోడ్డు పక్కన ఉన్న మురికి గుంత

బాన్సువాడ రూరల్: మండలంలోని తాడ్కోల్ గ్రామం బేస్త సంఘం సమీపంలో రోడ్డు పక్కన ఉన్న మురికినీటి గుంత దోమలకు ఆవాసంగా మారుతోంది. గుంతల్లో మురికి నీరు నిల్వ ఉండటంతో దోమలు విజృంభించి కాలనీ ప్రజలు రోగాల బారినపడే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి గ్రామంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని, కాలనీల్లోని మురికి గుంతల్లో నీరు నిల్వ ఉండకుండా మొరంతో చదును చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పద్మశాలీలు సంఘటితం కావాలి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): పద్మశాలీలు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని, ఇందుకోసం గ్రామాల్లోని పద్మశాలీలు సంఘటితమవ్వాలని సంఘం ఎల్లారెడ్డి డివిజన్ అధ్యక్షుడు దేవసాని పోశెట్టి అన్నారు. నాగిరెడ్డిపేటలో ఆదివారం మండలస్థాయి పద్మశాలీ సంఘ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లోని పద్మశాలీ కులస్తులు కమిటీలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. దీంతోపాటు ప్రతినెలా సమావేశాలు నిర్వహించుకోవాలన్నారు. అనంతరం ఇదివరకే ఉన్న మండల సంఘాన్ని యధావిధిగా కొనసాగించాలని తీర్మాణం చేశారు. మండల కమిటీ అధ్యక్షుడిగా మలిపెద్ది మల్లేశం(మాల్తుమ్మెద), ఉపాధ్యక్షులుగా లక్ష్మీకాంతం(గోపాల్‌పేట), విఠల్(గోపాల్‌పేట), ప్రధాన కార్యదర్శిగా మంత్రి ఆంజనేయులు(గోపాల్‌పేట), కోశాధికారిగా సాయిలు(తాండూర్), సహాయ కార్యదర్శులుగా మాడ ప్రవీణ్(వదల్‌పర్తి), పద్మ వెంకటేశం(తాండూర్) ఎన్నికయ్యారు.

ఆలయ భూములు అన్యాక్రాంతం



బొమ్మన్‌దేవ్‌పల్లిలో పంట వేయడానికి సిద్ధం చేసిన హనుమాన్ ఆలయ భూమి

నస్రుల్లాబాద్: మండలంలోని బొమ్మన్‌దేవ్‌పల్లి లోగల హనుమాన్ ఆలయ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. పోశెట్టిపల్లి రెవెన్యూ శివారులో గల 126, 127, 128 సర్వే నెంబరులో తరువాయికి ఉన్న వ్యక్తులు ఆలయ భూమిని ఆక్రమించి సాగు చేస్తున్నారు. ఈవిషయంపై చర్యలు తీసుకోవాలంటూ స్థానిక సబ్ కలెక్టర్‌కు ప్రజలు ఇటీవల ఫిర్యాదు చేశారు. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు.

నేడు యాడారంలో సామూహిక వన మహోత్సవం

బీబీపేట: మండలంలోని యాడారం గ్రామంలో రైతులు మల్బరి సాగుకు ముందుకు రావడంతో నేడు సామూహిక వన మహోత్సవం నిర్వహిస్తున్నట్లు జిల్లా పట్టు పరిశ్రమ అధికారి అయిలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా పట్టు పరిశ్రమకు సంబంధించిన మొక్కలు నాటనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

సంక్షిప్తం

వాహనాల తనిఖీ

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని కామారెడ్డి–ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై ఆదివారం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనదారులకు జరిమానా విధించారు. పోలీసులు మాట్లాడుతూ.. మద్యం తాగి వాహనాలను నడిపినట్లయితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

నవోదయకు ఎంపిక



రాజంపేట: మండలంలోని శివాయిపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థి హర్షిత్ యాదవ్ ఇటీవల నవోదయ పాఠశాలలో ప్రవేశం పొందారు. ఈసందర్భంగా విద్యార్థిని ఆదివారం కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అభినందిందించారు.

ఇంటింటికీ మొక్కల పంపిణీ



బాన్సువాడ: పట్టణంలోని 13వ వార్డులో ఆదివారం కాంగ్రెస్ నాయకులు ఇంటింటికీ పూల మొక్కలను పంపిణీ చేశారు. నాయకులు మహమ్మద్ గౌస్, సయ్యద్ ఇలియాస్, అలీ, ఇస్మాయిల్, సిరాజ్, అరుణ్, వెంకటేష్ ఉన్నారు.

పదవీ విరమణ సన్మానం

తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి హైస్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేసిన రాజాగౌడ్ పదవీ విరమణ పొందగా ఆదివారం ఆయనకు మండల కేంద్రంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు.



కార్యక్రమానికి ఎంఈవో రామస్వామి హాజరై, మాట్లాడారు. తాడ్వాయికి చెందిన రాజాగౌడ్ తాడ్వాయిలోనే పదవీ విరమణ పొందడం ఆయన అదృష్టమని కొనియాడారు. అనంతరం రాజాగౌడ్‌ను సన్మానించారు. హెచ్‌ఎంలు కల్యాణి, సంగారెడ్డి, నాయకులు నర్సింలు, సంజీవులు, శ్యాంరావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు..



భిక్కనూరు: మండలకేంద్రంలో పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపిన ఉత్తమ విద్యార్థులను ఆదివారం నీలకంఠ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. అనంతరం వెండి పథకాలను, నగదు బహుమతులను అందజేశారు. సంఘ ప్రతినిధులు కుడెల్లి నర్సింలు, పేష్కారి రవీందర్, మాడ రంజిత్, జ్ఞానేశ్వర్, వెంకటేశం, సిద్ధరాములు పాల్గొన్నారు.

జేఈఈలో ప్రతిభ చూపిన విద్యార్థికి..



మద్నూర్(జుక్కల్): మండల కేంద్రానికి చెందిన నాగంవార్ హరితేజ్ 2025 జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 210 ర్యాంకు సాధించడంతో ఆదివారం ఆయనను పెన్షనర్ల యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సంఘ అధ్యక్షుడు గంగారం, కార్యదర్శి రామారావు, మారుతి, మనోహర్, విఠల్, యాదవ్ తదితరులున్నారు.

రోటరీ క్లబ్‌కు అవార్డులు



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి రోటరీ క్లబ్ 2024–25 సంవత్సరానికి ఉత్తమ సామాజిక సేవ కార్యక్రమాలకు గానూ పలు అవార్డులు అందుకుంది. హైదరాబాద్‌లో నిర్వహించిన రోటరీ డిస్ట్రిక్ట్ అవార్డ్స్ కార్యక్రమంలో రోటరీ గవర్నర్ శరత్‌చౌదరి, అసిస్టెంట్ గవర్నర్ జైపాల్‌రెడ్డి చేతుల మీదుగా కామారెడ్డి క్లబ్ అధ్యక్షుడు రాజనర్సింహరెడ్డి, రోటరీయన్లు శ్రీశైలం, కాశీనాథం, రాజేష్, శంకర్, సుధాకర్‌రావు, కృష్ణహరి, వెంకటరమణలు అవార్డులు అందుకున్నారు.

బాధిత కుటుంబానికి చేయూత



నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండలం పడంపల్లి గ్రామానికి చెందిన వాగ్మరి బాల్‌రాజు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బాధిత కుటుంబానికి ఆదివారం ఏఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు సంతోష్, నాయకులు సాయిలు, అనిల్, శ్రీకాంత్, నాగ్‌నాథ్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ బడికి పెయింట్

ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని సబ్దల్‌పూర్ గ్రామానికి చెందిన యువకుడు జిలకర సత్యనారాయణ ఆదివారం తన సొంత ఖర్చులతో గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడి కేంద్రం భవనాలకు పెయింట్ వేయించారు. గ్రామస్తులు ఆయనను అభినందించారు.

నేడు రోడ్డు పనులకు శంకుస్థాపన

మద్నూర్(జుక్కల్): డోంగ్లీ మండలంలోని ఇలేగావ్ నుంచి మదన్‌హిప్పర్గా వరకు నిర్మించే బీటీ రోడ్డు పనులకు సోమవారం ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు శంకుస్థాపన చేయనున్నట్లు కాంగ్రెస్ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి పార్టీ శ్రేణులు తరలిరావాలని కోరారు.

ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తా

- కామారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి
- పలు గ్రామాల్లో అభివృద్ధి పనుల ప్రారంభం



దోమకొండలో ఆలయ అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి



భిక్కనూరులో వెంకటరమణారెడ్డిని సన్మానిస్తున్న నాయీబ్రాహ్మణ సంఘం సభ్యులు

భిక్కనూరు: ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తానని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. భిక్కనూరుతోపాటు సిద్ధరామేశ్వరనగర్, గుర్జకుంట, ర్యాగట్లపల్లి గ్రామాల్లో ఆదివారం తన సొంత నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలందరి సమస్యలను పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. ఎవరైన అర్హులకు సంక్షేమ పథకాలు అందకుంటే ఊరుకునేది లేదన్నారు. అనంతరం ఎమ్మెల్యేను నాయీబ్రాహ్మణ సంఘ సభ్యులు సన్మానించారు. బీజేపీ మండలాధ్యక్షుడు ఉప్పరి రమేష్, నేతలు గణేశ్‌రెడ్డి, పైడి రాజశేఖరరెడ్డి, మల్లారెడ్డి, క్రాంతి, కల్యాణ్,బాబు, సిద్ధరాములు పాల్గొన్నారు.

దోమకొండ: మండల కేంద్రంలో భూలక్ష్మి, మహలక్ష్మి ఆలయ నిర్మాణ పనులను ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి ప్రారంభించారు. ప్రతి గ్రామంలో కుల సంఘాలు, ఆలయాల అభివృద్ధికి తన సొంత నిధులు కేటాయిస్తున్నట్లు ఎమ్మెల్యే వివరించారు. బీజేపీ మండల అధ్యక్షుడు మద్దురి భూపాల్ రెడ్డి, కార్యదర్శి కాలువ అంజిరెడ్డి, నాయకులు కంది మనోజ్‌కుమార్, నరేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

పంట కాలువలో పూడిక తొలగింపు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని లింగంపేట, అయిలాపూర్ ఊర చెరువు కింద పంట కాలువ పూడికను ఆయకట్టు రైతులు పొక్లెయిన్ వాహనంతో తొలగించారు. లింగంపేట అలుగు నుంచి నీటిని పంట పొలాలకు సరఫరా చేసే కాలువలో పూడిక పేరుకుపోవడంతో నీటి సరఫరాకు ఇబ్బందిగా మారింది. దీంతో ఆయకట్టు రైతులు సాగునీటి కోసం యాసంగి, ఖరీఫ్ సీజన్‌లో అవస్థలు పడ్డారు. ఈక్రమంలో రైతులు ఆదివారం పొక్లెయిన్ ఏర్పాటు చేసుకొని కాలువలో పూడిక తొలగించారు.



పంట కాలువలో పూడిక తీయిస్తున్న రైతులు

ఆధ్యాత్మికం

భక్తిశ్రద్ధలతో బోనాల పండుగ





బిచ్కుందలో బోనాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న ప్రజలు.. భిక్కనూరులో..

సాక్షి నెట్‌వర్క్: నిజాంసాగర్, బిచ్కుంద, రాజంపేట, భిక్కనూరు, దోమకొండ, నాగిరెడ్డిపేట మండలాల్లో ఆదివారం బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయ మండలాల్లోని పలు గ్రామాల్లో గ్రామ దేవతలకు బోనాలను సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహమ్మద్ నగర్ మండలం బూర్గుల్, తుంకిపల్లి గ్రామాల్లో భక్తులు గ్రామ దేవతలకు మేకలు, కోళ్లలను బలి ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. బిచ్కుందలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మహిళలు బోనాల ఊరేగింపు నిర్వహించారు. అనంతరం నల్లపోచమ్మ, పెద్దపోచమ్మ అమ్మవార్లకు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రాజంపేటలో రజక సంఘం ఆధ్వర్యంలో గ్రామ దేవతలకు బోనాలు సమర్పించారు. భిక్కనూరులో మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో బోనాల ఊరేగింపు నిర్వహించారు. అనంతరం మహంకాళి, భూలక్ష్మి అమ్మవార్లకు బోనాలను సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. దోమకొండలో భూలక్ష్మి, మహాలక్ష్మి అమ్మవార్లకు బోనాల పండుగ నిర్వహించారు. నాగిరెడ్డిపేట మండలం పోచారంలో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గ్రామదేవతలకు బోనాల పండుగ నిర్వహించారు.



రాజంపేటలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



దోమకొండలో..



పోచారంలో..

వారాహి మాతకు ప్రత్యేక పూజలు



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కామారెడ్డి అర్బన్: పట్టణంలోని ఎన్‌జీవోఎస్‌కాలనీ లోగల లలితా త్రిపుర సుందరి ఆలయంలో ఇటీవల ప్రారంభమైన ఆషాడ మాస గుప్త నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా ఆదివారం ఆలయంలో వేదపండితులు ఆంజనేయశర్మ ఆధ్వర్యంలో వారాహి అమ్మవారికి పంచామృతాలతో విశేషాభిషేకాలు నిర్వహించారు. అనంతరం కామారెడ్డి కూచిపూడి కళాక్షేత్రం కళాకారులు వారాహి అమ్మవారిపై నిర్వహించిన నృత్య రూపకం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

శాకంబరిగా సంతోషిమాత

భిక్కనూరు: మండల కేంద్రంలోని సంతోషిమాత ఆలయంలో ఆదివారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆశాడమాస ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారిని కూరగాయలతో అలంకరించి, శాకంబరిమాతగా కొలుస్తూ పూజలు నిర్వహించారు. మహిళలు సామూహిక లలితాదేవి సహస్రనామాలను, మణిద్వీప వర్ణనను, లక్ష్మి అష్టోత్తరనామాలను పఠించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పురాం రాజమౌళి, ప్రధాన కార్యదర్శి చల్ల లక్ష్మణ్, కోశాధికారి కొడిప్యాక వెంకటేశం, పీఆర్‌వో పబ్బకిరణ్, బంక్ శీను పాల్గొన్నారు.

